

కథ 1998

7

# తలపాగా స్వగతం

కొట్టుగడ్డ దయానంద్

నేను తలపాగాని! మోకాళ్లు దాటని పంచె, ముతకబనీను, బనీను జేబులో నాలుగు పుగాక్కాడలు, మాసిన గడ్డమూ, మట్టి శరీరమూ, నెత్తిన కిరీటం... నేను తలపాగాని! మట్టితోనూ, మట్టినే నమ్ముకున్న జీవుల్తోనూ నా సహచర్యం.

సూర్యుడికంటే ముందే పొడిచి, చంద్రోదయం తర్వాతెప్పుడో విశ్రమిస్తాను. సూర్యచంద్రుల ప్రస్తావ నొచ్చింది కాబట్టి చెబుతున్నాను! అసందర్భప్పక్షి అని కొట్టిపారేస్తారేమో!

నేనిప్పుడు అస్తమయాల గురించి మాత్రమే చెప్ప దలచేను. సూర్యచంద్రులతో పోటీపడి చరించడం వల్ల నేమో ఋతువు మారినప్పుడల్లా అస్తమయం కావడమే నా జీవితం! ఒకసారి కాదు! వందల వేలసార్లు!! మొదటి సారి చచ్చిపోవడం ఎవరికైనా బాధే! తర్కించాల్సి వుంటుంది! మథించాల్సి ఉంటుంది!! వెనకా ముందూ ఆలోచించాల్సి ఉంటుంది. తర్వాత తర్వాత చూపు మాత్రమే నిరంతర జీవితంలో భాగమవుతుంది.

నేనిప్పుడు నా మరణాల గురించి మీతో చెప్ప దలచుకున్నాను. నాకు మట్టే ప్రపంచం!

దిగంతాల మధ్య, ఆకాశమే కప్పుగా, పచ్చదనాల మట్టి తోడే నా జీవితం.

నాకు జీవితమిచ్చింది ఈ మట్టి. శ్రమ సౌందర్యా నంతరం నిద్రపుచ్చి లాలించే తల్లి ఈ మట్టి. నా కష్ట సుఖాలకు నిరంతరం వెన్నంటి వుండే నా ఆత్మబంధువు ఈ మట్టి.

నా కష్టం ఈ మట్టి, నా జీవితం ఈ మట్టి.

భూమిని సాగుచేసిన తొలి రోజులు-

రాళ్లూ రప్పలేరేను. కంపా ముళ్లూ తీసేను. నాగలి పట్టి కోండ్రవేసి నా తల్లి గర్భం చీరేను. ఆగ్రహించలేదు మట్టి. అనుగ్రహించింది. చదును చేసి పిండిచేసి తొలకరి పదునుకు బంగారుముద్దని చేసేను. జొన్నలు వేసేను. రాసులు రాసులు పండేయి. ముప్పొద్దులా సంకటి- ఇంటిల్లిపాదికి కడుపు నింపింది నా మట్టితల్లి.

వరిగెలు వేసేను, రాగులు వేసేను. జారిపోయే గింజలు, ధగధగలాడే గింజలు. ఒకపూట సంకటి, ఒక పూట వరిగె అన్నమూ.

అమ్మా, నాన్నా, భార్య, పిల్లలూ... మట్టితోడే లోకం- మట్టితోనే ప్రపంచం.

బుడమొడ్లు వెదబెట్టేం! దంచితే ఇంటినిండా పరుచుకున్న ఎర్రెర్రటి బియ్యం!

ఇంటిల్లిపాదికీ ఒకపూట సామి బువ్వ- అన్నం కోసం వెదుకులాట- ఒడ్లు కోసం వెంపర్లాట- మట్టీ, నీళ్లు నిరంతరం ఒకదాన్నొకటి పెనవేసుకుని హొయలు హొయలుగా కులికే దగ్గర పండే ఒడ్ల కోసం ఆరాటం-

ప్రయాణం ప్రయాణం.

బండి నిండా జొన్నలు, వరిగెలు.

సద్ది తాగుతూ గెడ్డలు తింటూ మూడురోజుల ప్రయాణం- జొన్నలకు ఒడ్ల మారకం. వరిగెలకు ఎర్ర గెడ్డల మారకం.

ఎత్తుకు ఎత్తు మారకం!

జీవితమంటే నాదే! ఎంత హాయిగుందో, ఎంత పచ్చగుందో!

హరిదాసు హరెల్ల రంగ హరి పాటల మాధుర్యం, డూడూ బసవన్నల కదలికల వింత విన్యాసం, కాటిపాప లోడి చేతికర్ర విచిత్ర లాస్యం, చెంచులోల్ల చేతిగంటా, శిరస్సున నెమలి ఈకల విచిత్ర కదలికల సౌందర్యం...

జీవితమంటే నాదే, నాదే!

ఋతువు మారింది. అదును తప్పింది.

ఆ సంవత్సరం పదునయ్యే వానల్లేవు.

విత్తిన గింజల మొలకల అజాపజా లేదు. పంట ల్లేవు. నా మట్టితల్లి మొఖం చాటేసింది. ఆకలి! ఆకలి!!

మరుసటి సంవత్సరం పండిన జొన్నలకు మారకం లేదు.

ఊళ్లన్నీ తిరిగి తిరిగి అరెత్తు మారకానికి వడ్లు తెచ్చుకోవడం... అర్ధాకలి, అర్ధాకలి!!

మరుసటి సంవత్సరం అరెత్తు మారకమూ లేదు. ఊళ్లన్నీ తిరిగి తిరిగి మళ్లీ తిరిగి వచ్చి కాసులకు జొన్నల అమ్మకం...

మారకానికి బదులు కాసులు కాసులు.

నా మట్టి నా శ్రమ, నా పంట అంతా కాసుల మయం. అమ్మితే వచ్చేవి కాసిని, కొంటే కావాల్సినవి మరిన్ని! అంతా కాసుల దయ.

తొలిసారి నా అస్తమయం అప్పుడే!

జొన్నల లాభం లేదు. వరిగెలు లాభంలేదు. లాభ నష్టాల గురించి ఆలోచించాల్సిన దుర్దశ. తినాలి కదా! కడుపులు నిండాలికదా! కాసులు కావాలికదా! పండించే వాటికి కొనుక్కునేవి రానప్పుడు లాభనష్టాల బేరీజు తప్పదు.

తిండిగింజల్ని వదిలి సుదూర తీరాలకు తరలి వెళ్లిపోయే పంటలవైపు ప్రయాణం!

ధనియాల పంట కమ్మటి సుగంధ పరిమళం. పచ్చటి మొక్కల మీద పట్టపగలే తెల్లటి వెన్నెలపూత- చూస్తేనే కడుపు నిండే రాశుల రాశుల ధనియాలు- జల్లెడ పట్టి, మట్టి పెళ్లలేరి తూకమేసే పంట.

మిర్చిపంట- గుత్తులు గుత్తులుగా మొక్కలకు వేలాడే ఎర్రెర్రటి పంట- ఇంటి నిండా పంట వాసన, గుప్పుగుప్పుమని ముక్కుల్ని మండించే ఘాటు వాసన...

ఆనందం... ఆనందం... అది మాత్రం ఎన్నాళ్లు? ఒక సంవత్సరం పంట లేదు. మరు సంవత్సరం రేటు లేదు. ఆ తర్వాత తుపాను. సముద్రం ఉప్పొంగి పచ్చదనాన్ని కబళించిన తుపాను. నా సర్వస్వాన్నీ, సమస్తాన్నీ తనతో తీసుకెళ్లిన తుపాను. మళ్లీ చచ్చిపోయాను. మళ్లీ మళ్లీ చచ్చిపోయాను. నేనిప్పుడు నా అస్తమయాల గురించే చెప్పదలచుకున్నాను.

ఋతువు మారింది... పొగనారు వచ్చింది. మత్తు వాసన, గమ్మత్తయిన డబ్బు వాసన.

బంగారం ముద్ద నా మట్టి. పొగనారును అద్భుతంగా ఆలింగనం చేసుకుంది.

దళసరి ఆకులు... రెండు అరచేతుల వెడల్పు ఆకులు- జిడ్డుజిడ్డుగా నల్లనల్లగా ఒంటిని చుట్టుకు పోయే ఆకుల పత్రహరితం.

పగలు లేదు, రాత్రి లేదు. ఆకుల్ని పుటుక్కున తెంచి బండ్లకు బండ్లు తాళ్లతో అల్లటం- బ్యారన్లలో ఆకును కాల్చడం- ఏడేడు సముద్రాల కావలికి పంపడం. సందడి సందడి... కాసులు కాసులు... నోట్లు నోట్లు పల్లెనిండా ఆనందం, ఆర్భాటం... రోడ్డొచ్చింది. పట్నం దగ్గరైంది. బస్సులొచ్చేయి. ఇంటినిండా అనవసర ఆర్భాటాలు వచ్చేయి.

మళ్లీ సంవత్సరం రంగు తగ్గింది. రేటు లేదు.

ఆ మరుసటేడు అదును తప్పింది. ఇల్లు ఒట్టి పోయి మెడలు బోసిపోయాయి.

ఆ సంవత్సరం బాగానే పండింది. మంచి రేటే వచ్చింది. బ్యాంకుల్లో అప్పులు తీరుతాయనుకుంటే వాడు పుగాకు కంపెనీనే ఎత్తేసేడు.

అమ్మిన డబ్బు ఇంటికి చేరనే లేదు. పుగాకు గోడౌన్లు తుపానులో కొట్టుకుపోయాయని అబద్ధపు వర్తమానం... లక్షలకు లక్షలు దివాలా తీయించిన కంపెనీలు... మూకుమ్మడిగా తలపాగాల తలలు ముంచేసిన వైనం.

అప్పు తీర్చలేదని బ్యాంకుల వత్తిడి. జీపుల హడావుడి.

అప్పు తీర్చలేదని ఇల్లు వేలం... ఇంట్లో సామాను బజార్లో వేలం... అవమానం, అవమానం!

మళ్లీ చచ్చిపోయాను.

నేనిప్పుడు నా అస్తమయాల గురించే చెబుతున్నాను.

ప్రయాణం ప్రయాణం... సుదూర తీరాలకు అలసట లేని ప్రయాణం. రెక్కలున్నాయి గదా! మట్టిని బంగారం చేసే సువర్ణ విద్య తెలుసు కదా!

వ్యవసాయం వ్యాపారం, వ్యాపారం వ్యవసాయం!

మళ్లీ బంగారం కోసం దేవులాట. నల్లబంగారంతో తెల్లబంగారం కోసం వెంపర్లాట.

ఎంత అద్భుతమైనదీ మట్టి! దేన్నైనా తనలో ఇముడ్చుకుంటుంది.

దేన్నైనా ప్రకాశవంతం చేస్తుంది. పరిమళాన్ని చేస్తుంది. ఫలభరితం చేస్తుంది. నల్లటి విత్తుని తెల్లటి బంగారం చేస్తుంది.

సంతోషం ఆనందం. గెలిచేననే అనుకున్నాను. మళ్లీసారి తెల్లదోమ ముసిరింది. మందుల కొట్ల చుట్టూ

ప్రదక్షిణాలు మొదలయ్యేయి. మళ్లీ మరింత చెయ్యాలి. ఖర్చులు పోను మరింత మిగల్చాలి. లాభపడాలి.

వానలు లేవు. నీళ్ల కోసం దేవులాట. ఒకటి... రెండు... మూడు బోర్లు. చుక్కనీరు లేదు. మార్వాడీ దగ్గర బాకీలు మాత్రం పెరిగేయి.

రకరకాల పురుగులు, రంగురంగుల పురుగులు- మందుల్ని తాగేసి తెగ బలిసిన పురుగులు.

మందుల్లో కల్తీ- తల వంచింది తెల్లబంగారం.

విత్తనాల్లో కల్తీ- తల ఎత్తిన దానికి రేటు లేదు. అన్యాయమని బజార్లో వెర్రికేకలు... అరుపులు... కాల్పులు... కాల్పులు... తెగిపడ్డ తలపాగాల తలలు.

అప్పులు, అప్పులు, కుదవలో ఇల్లూ బంగారం, పస్తులు, పస్తులు... పెళ్లికాని ఆడపిల్లల దైన్యపు చూపులు... లాభం లేదు, లాభం లేదు.

పురుగుల్ని చంపలేని మందు మా బతుకులకు తప్పక ఆసరా అవుతుందన్న ధీమా!

చచ్చిపోతున్నాను చచ్చిపోతున్నాను.

నేను చచ్చిపోయినప్పుడల్లా ఎవడో ఒకడు మరింతగా ఊపిరి పోసుకుంటున్నాడు. మరింతగా ధగధగలాడుతున్నాడు. వాళ్లను బతకనివ్వండి.

విత్తనాలకు కల్తీ మందులకు ధర నిర్ణయించేది వాళ్లు! మేము పండించే పంటకు ధర నిర్ణయించేదీ వాళ్లే!

వాళ్లని మాత్రం బతకనివ్వండి. చావు నాకు కొత్త గాదు. దినదినం అస్తమానం అవమానాల్తో, అప్పుల్తో, పస్తుల్తో చచ్చేవాణ్ని.

తలపాగాలెన్ని రాలితే మీకేం!

మా చావు మీకు మూకుమ్మడి వెర్రి!

మా చావు మీకు వెలకట్టించి ఇచ్చే నోట్ల కట్టలు.

మళ్లీ బతుకనేది లేకుండా చంపండి.

నేనే రాలిపోయిన చిట్టచివరి తలపాగా కావాలి. అస్తమయాల గురించేకదా చెబుతున్నాను. మళ్లీ ఉషోదయం లేని అస్తమయం అనుగ్రహించండి! అనుగ్రహించండి!

అ... ను... గ్ర... హిం... చం... డి!!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 14 జూన్ 1998*

